సాక్షి తూర్పుగోదావరి

మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



తెలుసుకుందాం.. తేరుకుందాం


గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్)ను ముందస్తుగా గుర్తించేందుకు జీజీహెచ్ బృందం అమెరికా డాక్టర్లతో కలసి ముందుకొచ్చింది. - 8లో



గొడౌన్‌లో బియ్యం చోరీ

రైస్ బ్యాగ్‌లు దొంగతనాలకు పాల్పడే ముగ్గురు ముఠా సభ్యులను సోమవారం అరెస్టు చేసినట్టు నల్లజర్ల సీఐ జి.పెద్దిరాజు తెలియజేశారు. - 8లో

సముద్రంలోకి 1.62 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం సాయంత్రం 1,62,276 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది. తూర్పు డెల్టాకు 4,700, మధ్య డెల్టాకు 2,500, పశ్చిమ డెల్టాకు 7 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

రేపు 'నన్నయ'లో ప్రాంగణ ఎంపికలు

రాజానగరం: స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మా కంపెనీ రెడ్డీస్ ల్యాబ్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు జరగనున్నాయి. అన్లాటికల్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో ఉద్యోగాల భర్తీకి అభ్యర్థులను ఎంపిక చేస్తారని ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైన వారికి అప్రెంటీస్ ట్రైనీ హోదాతోపాటు నెలకు రూ.17,500 నుంచి రూ. 21,500 వరకు స్టైఫండ్ అందజేస్తారని అన్నారు. 2023 నుంచి 2024 విద్యా సంవత్సరంలో ఎమ్మెస్సీ ఆర్గానిక్, అనలిటికల్ కెమిస్ట్రీ, బీఎస్సీ మైక్రో బయోలజీ, బయో టెక్నాలజీ కోర్సులు 60 శాతం మార్కులతో పూర్తి చేసిన మహిళలు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అన్ని రకాల విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

పర్యావరణ సమతుల్యత కాపాడదాం..



కలెక్టరేట్‌లో మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పర్యావరణ సమతుల్యత కాపాడేందుకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో డ్వామా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద 'అకిరా మియావాకీ'లో కనీసం ప్రతి మండలంలో ఐదు నుంచి పది వరకూ ప్రదేశాల్లో మొక్కలు పెంచాలన్నారు. కలెక్టరేట్ ఆవరణలో 2,600 మొక్కలు నాటే బృహత్తర కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటడం కాకుండా వాటి నిర్వహణ బాధ్యతలు స్వీకరించాలన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు మొక్కలు నాటారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, డ్వామా ఇన్‌చార్జి పీడీ ఆర్.శ్రీరాములు నాయుడు, జిల్లా అధికారులు ఎస్.మాధవరావు, ఎన్‌వీవీఎస్ మూర్తి, జి.స్వామినాయుడు, కేఎస్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రీ రిపబ్లిక్ డే సెలెక్షన్స్

రాజానగరం: స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీలో వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ సెలెక్షన్స్ మంగళవారం జరగనున్నాయని ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. యూత్ అఫైర్స్, క్రీడా మంత్రిత్వ శాఖ ఎన్ఎస్ఎస్ వలంటీర్ల కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. కో ఆర్డినేటర్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, పీఓలు, పీఈటీలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

జాతీయ టీ- 10 క్రికెట్‌కు క్రీడాకారుల ఎంపిక




జాతీయ స్థాయి టీ-10 క్రికెట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

బిక్కవోలు: బలభద్రపురం ఉన్నత పాఠశాల చెందిన నలుగురు క్రీడాకారులు జాతీయ స్థాయి టీ- 10 క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కేవీ రాఘవులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ టీ-10 క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న గుంటూరు జరిగిన అంతర జిల్లాల పోటీల్లో బలభద్రపురం ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచారన్నారు. ఈ జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుందన్నారు. ఇందులో ఆరుగురు బలభద్రపురం క్రీడాకారులు ఉండగా, ఎస్.సమీర్, జి.ఈలోష్, జి.దుర్గా ప్రసాద్, పి.శివసాయిలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు వచ్చే నెలలో మహారాష్ట్ర నాసిక్ పట్టనంలో జరిగే పోటీల్లో రాష్ట్రం తరఫున ఆడతారన్నారు. క్రీడాకారులను, పీడీ జావిద్ కరిముద్దీన్‌ను పలువురు అభినందించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త కసరత్తు

- విద్యుత్ శాఖలో రెండు సర్కిళ్ల ఏర్పాటుకు సిద్ధం
- కనెక్షన్లు, ఉద్యోగుల కేటాయింపునకు చర్యలు
- వేరు కానున్న కోనసీమ, కాకినాడ, రంపచోడవరం



రాజానగరం నియోజకవర్గం వెలుగుబందలో రూపుదిద్దుకున్న విద్యుత్ ఉప కేంద్రం

సాక్షి, రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)లో కొత్త సర్కిళ్ల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో విభజన ప్రక్రియ చేపట్టేందుకు అధికారుల కసరత్తు ప్రారంభమైంది. కొత్తగా ఏర్పడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లా సర్కిళ్లకు అవసరమైన వసతులు, కార్యాలయాలు, అధికారుల కేటాయింపు, విద్యుత్ కనెక్షన్ల విభజన ప్రక్రియ యుద్ధప్రాతిపదికన చేపట్టేందుకు అడుగులు పడుతున్నాయి. కొత్త సర్కిళ్లకు ఎస్ఈల నియామకం పూర్తయ్యింది. అధికారికంగా పేర్లు వెల్లడి కావాల్సి ఉంది. నేడో రేపో విభజన అంశం ఓ కొలిక్కి వస్తుంది. ఇక కొత్త సర్కిళ్ల ద్వారా పాలన సాగనుంది.

ఇదీ సంగతి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, రంపచోడవరం ప్రాంతాలకు రాజమహేంద్రవరం సర్కిల్ కార్యాలయం కేంద్రంగా ఉంది. ఇక్కడి నుంచే విద్యుత్‌కు సంబంధించిన అన్ని రకాలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. పాలన ప్రజలకు చేరువ చేయాలన్న తలంపుతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల విభజన చేపట్టారు. ఉమ్మడి తూర్పుగోదావరి మూడు జిల్లాలుగా ఆవిర్భవించింది. ఇలా కలెక్టరేట్, ఎస్పీ, తదితర జిల్లా స్థాయి కార్యాలయాలన్నీ ఆయా జిల్లా కేంద్రాల్లో కొలువు దీరాయి. విద్యుత్ సర్కిళ్ల విభజన చేపట్టాలని భావించినా కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా సాధ్యం కాలేదు. ప్రస్తుతం కొత్త సర్కిళ్ల ఏర్పాటుకు ఇటీవల ఉత్తర్వులు వెలువరించిన విషయం తెలిసిందే. ఆ దిశగా అధికారులు సైతం విభజన ప్రక్రియ వేగవంతం చేస్తున్నారు.

నూతన సర్కిళ్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గృహ వినియోగ విద్యుత్ కనెక్షన్లు సుమారు 16.70 లక్షలు, వాణిజ్యం 1,93,613, వ్యవసాయం 63,751, పారిశ్రామికం 6,314, హెచ్‌టీ 11 కేవీ 1,292 కనెక్షన్లు ఉన్నాయి. ఈ కనెక్షన్లు ఏ జిల్లాకు ఎన్ని ఇవ్వాలన్న అంశంపై కసరత్తు జరుగుతోంది. కొత్తగా రాజమహేంద్రవరం సర్కిల్‌లో ఏలూరు సర్కిల్ నుంచి గోపాలపురం, నిడదవోలు, కొవ్వూరు నియోజకవర్గాలు కలవనున్నాయి. రాజమహేంద్రవరం సర్కిల్ నుంచి కాకినాడ, కోనసీమ జిల్లాలతో పాటు రంపచోడవరం విడిపోనుంది. ఆయా జిల్లా కేంద్రాల్లో ఎస్ఈ కార్యాలయాలు, అవసరమైన ఉద్యోగులు, సిబ్బందిని కేటాయించనున్నారు. ఈ విషయమై ఇప్పటికే కసరత్తు ప్రారంభమైంది. త్వరలోనే పూర్తయి అన్ని హంగులతో కొత్త సర్కిళ్లు కొలువు దీరనున్నాయి.

విద్యుత్ రంగంలో అనేక సంస్కరణలు

కొత్త సర్కిళ్ల ఏర్పాటుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అడుగులు పడ్డాయి. విభజనకు అవసరమైన అన్ని రకాల మార్గదర్శకాలు సిద్ధం చేసి పెట్టారు. కొన్ని అనివార్య కారణలతో కార్యరూపం దాల్చలేదు. ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో విభజన అంశాన్ని కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. తిరిగి 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనాల ద్వారా తేరుకున్న ప్రభుత్వం హుటాహుటిన కొత్త సర్కిళ్లు ప్రకటించింది.

అంతేగాక ప్రతి గ్రామానికి ఆటంకం లేని విద్యుత్ సరఫరా దిశగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. లో ఓల్టేజ్, ఓవర్ లోడ్, ట్రిప్, పవర్ కట్ లాంటి సమస్యలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు, పల్లె ప్రజలకు త్రీఫేజ్ కరెంట్ అందించేందుకు శ్రీకారం చుట్టింది. వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు నాణ్యమైన విద్యుత్ ఇచ్చే క్రమంలో విద్యుత్ రంగంలో అనేక సంస్కరణలకు నాంది పలికింది. రీవాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డీఎస్ఎస్) పథకంలో భాగంగా ఎలాంటి అంతరాయం లేకుండా 24 గంటల పాటు నిరంతరాయ విద్యుత్ సరఫరా చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని పెంచే దిశగా అప్పటి ప్రభుత్వం విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా రూ.411 కోట్లతో 26 విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇలా 132/33 కేవీ, 400/132 కేవీ, 220/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రాలు అందుబాటులోకి తీసుకువచ్చింది. 17 సబ్ స్టేషన్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన 9 ఉప కేంద్రాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

వినియోగదారులకు మెరుగైన సేవలు

కొత్త సర్కిళ్ల ఏర్పాటుతో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందే అవకాశం ఉంది. ప్రధానంగా కాకినాడ, కోనసీమ జిల్లా వాసులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. వినియోగదారుల సమస్యల పరిష్కారం, దరఖాస్తులకు ఆమోదం తెలిపే ప్రక్రియ ఎస్ఈ పరిధిలో ఉంది. ప్రస్తుతం రాజమహేంద్రవరంలో కార్యాలయం ఉండటంతో కోనసీమ, కాకినాడ జిల్లాల నుంచి 60 కిలో మీటర్లకు పైగా ప్రయాణించాల్సి ఉంటోంది. కొత్త సర్కిళ్లతో వ్యయ ప్రయాసలకు చెక్ పడనుంది. ఎస్ఈతో పాటు టెక్నికల్, కమర్షియల్ విభాగాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, కన్‌స్ట్రక్షన్లు, మీటర్స్ అండ్ ప్రొటెక్షన్ విభాగ ఏఈలతో పాటు విద్యుత్ చౌర్య నివారణ విభాగం సైతం ఏర్పాటయ్యే అవకాశం ఉంది. దీంతో వినియోగదారులు వారి జిల్లా పరిధిలోనే సేవలు పొందే అవకాశం కలుగుతుంది.



రాజానగరం మండలం రాధేయపాలెంలో విద్యుత్ సబ్ స్టేషన్

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..



కొత్త సర్కిళ్ల ఏర్పాటుకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. కోనసీమ, కాకినాడ జిల్లాలలో కొత్త కార్యాలయాలు కొలువుదీరుతాయి. వాటికి అవసరమైన కసరత్తు ప్రారంభించాం. ఏ సర్కిల్‌కు ఎంత మంది అధికారులను కేటాయించాలి, ఎన్ని విద్యుత్ కనెక్షన్లు మార్పు చేయాలన్న విషయమై ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాం. ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపుతాం. అక్కడి నుంచి గ్రీన్ సిగ్నల్ అందిన వెంటనే ప్రక్రియ పూర్తి చేస్తాం. యుద్ధప్రాతిపదిన పూర్తి చేసేందుకు శ్రమిస్తున్నాం.

– కె.తిలక్‌కుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ, రాజమహేంద్రవరం

జిల్లాలో అధికారుల బదిలీలు



శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి



నాగ మహేశ్వరరావు, పీడీ, డ్వామా

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో పలువురు అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. జిల్లా పంచాయతీ అధికారిగా విశాఖపట్నం ఎస్ఎస్ఏలో అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న బి.శ్రీనివాసరావును నియమించింది. ఇప్పటి వరకూ డీపీఓగా విధులు నిర్వహించిన డి.రాంబాబును ఎంపీడీఓగా బదిలీ చేసింది. డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌గా కృష్ణా జిల్లా డ్వామా కార్యాలయంలో పరిపాలనాధికారిగా ఉన్న ఎ.నాగ మహేశ్వరరావును నియమించింది. ప్రస్తుతం ఇన్‌చార్జి డ్వామా పీడీగా జిల్లా సహకార అధికారి శ్రీరాములు నాయుడు వ్యవహరిస్తున్నారు. జిల్లా రాజమహేంద్రవరం ఆర్‌డబ్ల్యూఎస్ అండ్‌ఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న డి.బాలశంకరరావును ప్రకాశం జిల్లా ఒంగోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బదిలీ చేశారు. రాజమహేంద్రవరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు ఏపీఎంఎస్ఐడీసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ గిరిని నియమించారు. రాజమహేంద్రవరం డీఎల్‌డీఓ పి.వీణాదేవిని ఏలూరుకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో మచిలీపట్నం డీఎల్‌డీఓ జి.పద్మను నియమించారు.

వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలి



సీతానగరంలో క్రీడా వికాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సీతానగరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్లోని క్రీడా వికాస కేంద్ర భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం ఇక్కడి ప్రభుత్వ హైస్కూల్లోని క్రీడా వికాస కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. క్రీడా వికాస కేంద్రాల ఆవశ్యకత గుర్తించి, తక్షణం మరమ్మతులు చేసి, క్రీడాకారులకు అందుబాటులో తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. క్రీడా వికాస కేంద్రం వేదికగా జరుగుతున్న పనుల వివరాలను ఆర్అండ్‌బీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్అండ్‌బీ జిల్లా అధికారి ఎస్‌బీవీ రెడ్డి, జిల్లా క్రీడా సాధికారత అధికారి బీవీవీ శేషగిరి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎంపీడీఓ కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుబ్బాలమ్మ హుండీ ఆదాయం రూ.1.21 లక్షలు



అమ్మవారి ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నిడదవోలు రూరల్: మండలంలోని గోపవరం గ్రామంలో కొలువైన గుబ్బాలమ్మ వారి ఆలయ హుండీని సోమవారం తెరిచి లెక్కించినట్టు ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాష్ తెలిపారు. దేవదాయ శాఖ తాడేపల్లిగూడెం ఇన్‌స్పెక్టర్ ఎ.సుజన్‌కుమార్ పర్యవేక్షణలో గుబ్బాలమ్మ ఆలయ హుండీని లెక్కించగా 72 రోజులకు రూ.1,20,850 ఆదాయం వచ్చినట్టు ఆయన చెప్పారు. ఉప సర్పంచ్ ఎ.శ్రీనివాస్, నాయకులు ఆరేపల్లి చిన నంగాలు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో 'మీట్ అండ్ గ్రీట్'



'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మొదటి సంవత్సరం విద్యార్థినులను ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ కళాశాలలో మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. అలాగే స్వయం ఉపాధి కార్యక్రమాల గురించి తెలియజేశారు. సమాజంలో మహిళలు పాత్ర ప్రాముఖ్యతను వివరించారు. ఐ.క్యూ.ఏ.సి. కో ఆర్డినేటర్ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ మహిళలు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌గా మారాలని, మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ క్లబ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ అకడమిక్ పెర్ఫార్మెన్స్‌లో బలమైన ముద్ర వేయాలని, సెల్ఫ్ డెవలప్‌మెంట్ అవసరమని గుర్తు చేశారు. కళల విభాగం తరఫున డాక్టర్ సీతా మహాలక్ష్మి మాట్లాడుతూ మ్యూజిక్, డ్యాన్స్ క్లాసెస్‌లో విద్యార్థినులకు ఫ్రీగా ట్రైనింగ్ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం టీం సభ్యులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించేలా జీఓ ఇవ్వాలి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఎంజీఓ హోంలో ఉమెన్ హెల్త్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఇది ఏపీ ఉమెన్ హెల్త్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ వీకేఎస్ జయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా తూర్పు, కోనసీమ జిల్లాల కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. 27 ఏళ్లుగా ఎటువంటి పదోన్నతులు లేకుండా మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్‌గానే మిగిలిపోతున్నారని, వారికి సూపర్‌వైజర్లుగా పదోన్నతులు కల్పించేందుకు 143 జీఓను అమలు చేయాలని కోరారు. అలాగే 115 జీఓ అమలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కొనసాగించాలని తీర్మానించారు. ఐదేళ్ల నుంచి ఎంపీహెచ్ఏ (ఎఫ్), ఎంపీహెచ్ఎస్ (ఎఫ్)లకు ఎఫ్‌టీఏలు రావడం లేదన్నారు. పీహెచ్ఎస్‌లకు యూనిఫారం అలవెన్స్ రావడం లేదని, వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షురాలు ఎం.నాగమణి, వైస్ ప్రెసిడెంట్ జీవీ కృష్ణకుమారి, సెక్రటరీ కుసుమ, జాయింట్ సెక్రటరీలు సుభాషిణి, జి.హైమావతి, హెలీనా, ట్రెజరర్ ఝాన్సీ, అసోసియేట్ ప్రెసిడెంట్ హెలీనా తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో కానూరు వాసి మృతి



శ్రీరాఘవ దొర (ఫైల్)

పెరవలి: అమెరికా వెళ్లి ఉన్నత చదువు పూర్తి చేసుకుని, ఉద్యోగ ప్రయత్నంలో ఉండగా సోమవారం ఉదయం గుండెపోటుతో కానూరు గ్రామ వాసి మృతి చెందాడు. పెరవలి మండలం కానూరు గ్రామానికి చెందిన చిలుకూరి శ్రీరాఘవ దొర (24) అమెరికాలోని డల్లాస్‌లో ఎమ్మెస్ పూర్తి చేసుకుని ఉద్యోగ ప్రయత్నంలో ఉండగా గుండెపోటు వచ్చింది. ఈ విషయాన్ని అక్కడి వారు కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుడికి తండ్రి లేకపోవడంతో తాతయ్య, నడుపల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ ఈద్పుగంటి దొరయ్య సంరక్షణలో పెరిగాడు. ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగం సంపాదించుకుని ఆర్థికంగా స్థిరపడే సమయంలో ఈ ఘటన జరిగిందని దొరయ్య వాపోయారు.

వెల్లువెత్తిన సమస్యలు

జిల్లా స్థాయి 'స్పందన'కు 450 అర్జీలు



ఫిర్యాదులు అందజేయడానికి వచ్చిన ప్రజలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులు కావొస్తుండడంతో సంబరాలు జరుపుకొంటుంది. ఏదో చేసేశామని ఆ పార్టీల నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారు. తీరా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయడానికి కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిదర్శనంగా నిలిచింది. సోమవారం స్థానిక కలెక్టరేట్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి రికార్డు స్థాయిలో 450 అర్జీలు వచ్చాయి. ఎన్నడూ లేని విధంగా అధిక సంఖ్యలో అర్జీలు రావడం గమనార్హం. కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలన ఎలా ఉందో సోమవారం జరిగిన ఈ పరిష్కార వేదిక చూస్తే అర్థం అవుతుందని పలువురు అంటున్నారు. ఈ అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. ప్రజాప్రతినిధుల సిఫార్సులు ఉంటే కాని సమస్యలు పరిష్కారం కాని పరిస్థితి ఉండడంతో ఇబ్బంది వస్తోందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఏరువాక సాగుతూ..

- ముందస్తు పొగాకు సాగుకు సిద్ధం
- ఈ నెలాఖారు నుంచి నాట్లు
- దుక్కులు చేస్తున్న రైతులు



దేవరపల్లిలో పొగాకు నాట్లు వేయడానికి దుక్కు సిద్ధం చేస్తున్న రైతు

దేవరపల్లి: పొగాకు రైతులు ఏరువాక సాగుతున్నారు.. ముందస్తు సాగుకు అడుగులు వేస్తున్నారు.. 2024-25 సీజన్‌కు అవసరమైన వర్జీనియా పొగాకు పండించేందుకు సిద్ధమవుతున్నారు. సాధారణంగా ఏటా అక్టోబర్ 15 దాటిన తర్వాత పొగాకు నాట్లు ప్రారంభిస్తారు. వాతావరణం అనుకూలిస్తే డిసెంబరు 15 నాటికి నాట్లు పూర్తవుతాయి. పల్లపు ప్రాంతాలు, బాడవ పొలాల్లో సాగు చేసే రైతులు డిసెంబర్ నెలాఖరు వరకూ నాట్లు వేస్తారు. ముందస్తుగా వేసిన తోటలు జనవరి మొదటి వారంలో ఆకు రెలుపులు, క్యూరింగ్‌లు ప్రారంభమవుతాయి. ఫిబ్రవరిలో పొగాకు కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇదీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతంలో పొగాకు సాగు విధానం. అయితే ఈ ఏడాది ముందస్తు సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ నెలాఖరున నాట్లు ప్రారంభించనున్నారు. దీనికి అవసరమైన దుక్కులను రైతులు సిద్ధం చేస్తున్నారు. దసరా నుంచి నాట్లు ముమ్మరంగా జరగనున్నాయి.

లాభదాయకం.. ఆరోగ్యకరం

ముందస్తు సాగు లాభదాయకమని రైతులు అంటున్నారు. ముందుగా వేసిన తోటలు ఆరోగ్యకరంగా ఉండి, అధిక దిగుబడులు వస్తాయని చెబుతున్నారు. లేతగా వేసిన తోటలు దిగుబడులు తగ్గడంతో పాటు చీడపీడలు ఎక్కువగా వ్యాపిస్తాయి. ముందస్తుగా వేసిన తోటలు ఎకరాకు 12 నుంచి 13 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. ఆలస్యంగా వేసిన తోటలు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని రైతులు వివరిస్తున్నారు. గత ఏడాది డిసెంబరులో బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను కారణంగా కురిసిన అధిక వర్షాలకు లేతగా వేసిన పొగాకు తోటలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. ముందుగా వేసిన తోటలు కొంత వరకూ కోలుకున్నాయి. అందుకే ముందస్తు మొగ్గు చూపుతున్నారు.

60 వేల ఎకరాల్లో సాగు

పొగాకు బోర్డు రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం-1, 2 వేలం కేంద్రాల పరిధిలో సుమారు 60 వేల ఎకరాల్లో పొగాకు పంట సాగు చేస్తున్నారు. 2022-23 సీజన్‌లో 40 వేల ఎకరాల్లో సాగు చేయగా, 2023-24 సీజన్‌లో దాదాపు 60 వేల ఎకరాల్లో పండించారు. బోర్డు అనుమతించిన దాటికంటే అదనంగా సుమారు 20 వేల ఎకరాల్లో పంట వేశారు. 2023-24 సీజన్‌లో మార్కెట్లో మంచి లాభాలు రావడంతో 2024-25 ఏడాదికి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. బోర్డు అనుమతించిన దానికంటే ఎక్కువ విస్తీర్ణంలో పంట వేయవద్దని బోర్డు అధికారులు రైతులకు విజ్ఞప్తి చేస్తున్నారు. 12,861 మంది రైతులు, 14,856 బ్యారన్లు ఉన్నాయి. 23,258 హెక్టార్లలో పంట సాగు చేస్తున్నారు.

58.25 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి

2024-25 సీజన్‌కు 58.25 మిలియన్ల కిలోల ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇచ్చింది. బ్యారన్‌కు 2023-24 సీజన్‌లో 35 క్వింటాళ్ల ఉత్పత్తికి, 2024-25 సీజన్‌కు 42.75 క్వింటాళ్ల ఉత్పత్తికి అనుమతులు ఇచ్చింది. తొర్రేడు ప్రాంతంలో బ్యారన్‌కు 41.25 క్వింటాళ్ల ఉత్పత్తికి అనుమతి ఇచ్చింది. గత ఏడాది ఎస్ఎల్ఎస్ ప్రాంతంలోని ఐదు వేలం కేంద్రాల్లో 49.50 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా, సుమారు 67 మిలియన్ల కిలోల పంట ఉత్పత్తి జరిగినట్టు అధికారుల అంచనా.



పొలంలో నాటడానికి సిద్ధంగా ఉన్న పొగాకు నారు

నిబంధనలకు లోబడి పండించాలి



పొగాకు బోర్డు నిబంధనలకు లోబడి రైతులు పంట వేయాలి. ప్రస్తుతం మార్కెట్లో పలుకుతున్న ధరను చూసి వచ్చే ఏడాది సాగు విస్తీర్ణం పెరిగితే నష్టపోతారు. దేశంలో పొగాకు వినియోగం పెరగలేదు. బ్రెజిల్, జింబాబ్వే దేశాల్లో గత ఏడాది పంట దెబ్బతిని ఉత్పత్తి తగ్గడంతో మన పొగాకుకు డిమాండ్ ఏర్పడింది. ఈ ఏడాది ఆయా దేశాల్లో ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని సంకేతాలు అందుతున్నాయి. పురుగు మందుల అవశేషాలు లేకుండా నాణ్యమైన పంట పండించాలి. ఎస్ఎల్ఎస్‌లో 58.25 మిలియన్ల కిలోల ఉత్పత్తికి బోర్డు అనుమతించింది. ఆ మేరకు పంట పండించాలి.

–జీఎల్‌కే ప్రసాద్, రీజినల్ మేనేజర్, పొగాకు బోర్డు, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

కాలువలో పడి వ్యక్తి మృతి


బాలరాజు

తాళ్లరేవు: మండలంలోని కోరంగి పంచాయతీ పాత కోరంగి గ్రామానికి చెందిన బత్తుల బాలరాజు (45) ప్రమాదవశాత్తూ కాలువలో పడి మృతి చెందాడు. సోమవారం బాలరాజు కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు బాలరాజు పశువులను మేపుతూ గ్రామ చెంతనే ఉన్న కాలువలో కాళ్లు కడుక్కునేందుకు దిగాడు. ఆ సమయంలో అకస్మాత్తుగా అతనికి గుండెపోటు రావడంతో అదుపుతప్పి పడిపోయి ఊబిలో కూరుకుపోయాడు. అది గమనించిన స్థానికులు అతన్ని పైకి తీసేందుకు ప్రయత్నించే లోపే బాలరాజు మృతి చెందినట్లు గుర్తించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే బతుకుదెరువు కోసం ఇటీవలే కువైట్ వెళ్లిన భార్య మంగ హుటాహుటిన బయలుదేరినట్లు తెలిసింది. ఈ సంఘటనతో పాతకోరంగి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎక్కడా చిరుత కదలికలు రికార్డు కాలేదు


రిజర్వ్ ఫారెస్ట్‌లో ట్రాప్ కెమెరాలను అమరుస్తున్న అటవీ సిబ్బంది

రాజానగరం: లాలాచెరువు, దివాన్‌చెరువు రిజర్వ్ ఫారెస్ట్ పరిసరాల్లో సంచరిస్తున్న చిరుతపులి కదలికలకు సంబంధించి గత మూడు రోజులుగా ఎటువంటి ఆధారాలు లభించలేదని, వివిధ చోట్ల తాము అమర్చిన ట్రాప్ కెమెరా, సీసీ కెమెరా ఏ ఒక్కదానిలో కూడా కదలికలు రికార్డు కాలేదన్నారు. అలాగే ఆయా పరిసరాల్లో తాము చిరుతపులిని చూశామనే విధంగా స్థానికుల నుంచి కూడా ఎటువంటి సమాచారం, ఫిర్యాదులు అందలేదన్నారు. అయినప్పటికీ చిరుతపులిని బంధించడానికి తమ సిబ్బంది నిరంతర నిఘా కొనసాగిస్తూనే ఉన్నారన్నారు. ట్రాప్ కెమెరాలను వంద నుంచి 105కి పెంచామని, 10 చోట్ల సీసీ టీవీ కెమెరాలను అమర్చి, ఏడు ప్రాంతాల్లో ట్రాప్ కేజ్ (ఇనుప బోను)లను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఎటువంటి భయాందోళనకు గురికావొద్దని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఏ విధమైన సమాచారం తెలిసినా వెంటనే తమకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

తెలుసుకుందాం.. తేరుకుందాం

- కాకినాడ జీజీహెచ్‌లో ఉచిత సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు
- పీఐఎన్‌సీసీ, జీజీహెచ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ
- 21 నుంచి 60 ఏళ్ల లోపు మహిళలకే ముప్పు
- 26వ తేదీ వరకూ అవకాశం


స్క్రీనింగ్ పరీక్షలకు హాజరైన మహిళలు, యువతులు


కలెక్టర్ షణ్మోహన్‌తో అమెరికాకు చెందిన పింక్ ఎన్‌జీవో వైద్య బృందం

కాకినాడ క్రైం: క్యాన్సర్.. ప్రమాదకరమే.. ముందస్తుగా తెలుసుకుంటే నివారణ సాధ్యమే. అందుకే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్)ను ముందస్తుగా గుర్తించేందుకు జీజీహెచ్ బృందం అమెరికా డాక్టర్లతో కలసి ముందుకొచ్చింది. తాజా గణాంకాల ప్రకారం క్యాన్సర్‌తో మృతి చెందుతున్న మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ బారిన పడిన వారే అధికం. ఈ నేపథ్యంలో వైద్య వర్గాలు అప్రమత్తమయ్యాయి. అనుబంధ ప్రభుత్వ, ప్రభుత్వేతర విభాగాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు నియంత్రణ, నివారణకు ముందుకు వస్తున్నారు. ఈ ప్రమాదం నుంచి మహిళలను బయటపడేసే అనేక శాస్త్రీయ విధానాలకు రూపకల్పన చేసి అమలు చేస్తున్నాయి. అందులో ఓ కీలక ప్రయత్నమే ఉచిత సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు. కాకినాడ జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, అంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ వాసన్ సంయుక్త పర్యవేక్షణలో ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి.

‘పింక్’ సౌజన్యంతో..

కాకినాడ జీజీహెచ్ గైనకాలజీ, అంకాలజీ విభాగాలతో పాటు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం పాటు పడుతున్న అమెరికా స్థాపిత అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ పింక్ (పీఐఎన్‌సీసీ- ప్రివెంటింగ్ సర్వైకల్ క్యాన్సర్ గ్లోబల్లీ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అమెరికా నుంచి జీజీహెచ్‌కు డాక్టర్ల బృందం

అమెరికాకు చెందిన భారత సంతతి ప్రఖ్యాత రొబొటిక్ సర్జన్, యూరో గైనకాలజిస్టు డాక్టర్ సమత కడియాల ఆధ్వర్యంలో ఏడుగురు సభ్యుల వైద్య బృందం ఈ స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణకు కాకినాడ జీజీహెచ్‌కు చేరుకుంది. ఈ బృందం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివిధ దేశాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి ప్రాథమిక దశలోనే గుర్తించడంలో నిష్ణాతులు. వీరికి జీజీహెచ్ గైనకాలజీ, అంకాలజీ విభాగాల వైద్యులు పూర్తి సహాయ సహకారాలు అందించనున్నారు. అమెరికన్ బృందం పరీక్షలు నిర్వహించడంతో పాటు భవిష్యత్‌లో జీజీహెచ్ వైద్య బృందాలే పరీక్షలు నిర్వహించేలా శిక్షణనిస్తారు.

ఆ పరికరం మనకే...

పింక్ సంస్థ పూర్తి ఖర్చును భరిస్తూ పరీక్షలు నిర్వహిస్తోంది. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ పరీక్షల నిర్వహణకు థర్మల్ అబిలేషన్ టెక్నిక్ అనే యంత్రాన్ని వినియోగిస్తారని అంకాలజిస్టు డాక్టర్ ప్రదీప్ అన్నారు. తొలి దశలో గుర్తించబడ్డ క్యాన్సర్ల(ఎర్లీ లీజన్స్)కు ఈ పరికరం ద్వారా చికిత్స చేసి కేవలం 30 సెకన్లలో తొలగిస్తారన్నారు. పరీక్షల అనంతరం పింక్ సంస్థ ఈ పరికరాన్ని జీజీహెచ్‌కు ఇవ్వనుందని ఈ యంత్రం ధర సుమారు రూ.3 లక్షలని ప్రదీప్ తెలిపారు.

నిర్లక్ష్యం చేస్తే ప్రాణపాయం..

మహిళలు సర్వైకల్ క్యాన్సర్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాపాయానికి దారి తీస్తుందని గైనకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దోనేపూడి విజయ తెలిపారు. హెచ్‌పీవీ వైరస్ వల్ల ఈ వ్యాధి సోకుతుందని, అది ఒక లైంగిక సంక్రమణ వైరస్ అని అన్నారు. తొలి దశలోనే గుర్తిస్తే నూటికి నూరుపాళ్లు ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని తెలిపారు.

రిజిస్ట్రేషన్ ఇలా...

సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణకు ప్రత్యేక రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంది. ఆసుపత్రిలోని ఎస్‌ఆర్‌ఎంటీ బ్లాక్‌లో ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు ఈ స్క్రీనింగ్ పరీక్షలు కొనసాగుతుండగా, సమీపంలోనే ఆఫ్ లైన్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.

అలాగే టెలిఫోనిక్ రిజిస్ట్రేషన్, ఈ మెయిల్ రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించారు. రిజిస్ట్రేషన్ కోసం డాక్టర్ రాణి నీలిమను 88852 53889లో సంప్రదించాలనీ, ఆర్‌వోఆర్‌ఎంసీకేకేడీ(ఎట్‌ద రేట్)జీమెయిల్.కామ్ ద్వారా ఈ మెయిల్‌లో నమోదు చేసుకోవాలని గైనకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సూర్యకుమారి వెల్లడించారు. ఈ నెల 26వ తేదీ వరకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. 21 కంటే తక్కువ వయసులో వివాహమై మూడేళ్లు దాటితే పరీక్షలు చేయించుకోవాలి. హెచ్‌వోడీ అనురాగమయి ఆధ్వర్యంలో డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ విజయ, డాక్టర్ రుక్మిణిల బృందం ఈ పరీక్షల నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తోంది. పింక్ బృందం సేవలు జీజీహెచ్‌కు అందేలా చొరవ చూపిన డాక్టర్ వాసన్‌కు అభినందనలు.

– డాక్టర్ లావణ్యకుమారి, సూపరింటెండెంట్, జీజీహెచ్

గుర్తించిన వెంటనే చికిత్స



స్క్రీనింగ్ పరీక్షల్లో తొలి దశ క్యాన్సర్‌ను గుర్తిస్తే థర్మల్ అబిలేషన్ టెక్నిక్ యంత్రాన్ని వినియోగించి తక్షణమే తొలగిస్తారు. రాష్ట్రంలో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ కేసులు అధికంగా ఉన్నాయి. మహిళలు అప్రమత్తంగా ఉండాలి. పరీక్షల్లో క్యాన్సర్‌ను గుర్తిస్తే దశను అనుసరించి గైనకాలజీ, అంకాలజీ నిపుణులు చికిత్స అందిస్తారు. డాక్టర్ సమత ఆధ్వర్యంలో పింక్ బృందానికి అభినందనలు.

– డాక్టర్ శ్రీనివాసన్, హెచ్‌వోడీ, అంకాలజీ

పంచాయతీరాజ్ వ్యవస్థపై అవగాహన ఉండాలి


పలు జిల్లాల్లోని మండల స్థాయి అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న కృష్ణమోహన్

సామర్లకోట: పంచాయతీరాజ్ అధికారులు, విధులపై మండల స్థాయి అధికారులకు అవగాహన ఉండాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ కమిషనర్ ఈ.కృష్ణమోహన్ అన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాలోని ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీ, సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ పంచాయతీ అధికారుల విధులను స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇవ్వడానికి మండల స్థాయి అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. పంచాయతీ అధికారులు, తెలుసుకున్న సమయంలో ప్రజా ప్రతినిధులు పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ సమావేశాల్లో మాట్లాడే విధానంపై అవగాహన ఉంటుందన్నారు. జిల్లా పరిషత్ పాలక మండలికి చట్ట పరమైన హోదా ఉంటుందని తెలిపారు. పంచాయతీ రాజ్ చట్టం 1994పై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని చెప్పారు. ఆయా మండలాలలో 100 శాతం ఎస్టీలు ఉన్న ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా వనరుల పంపిణీ సక్రమంగా జరగాలన్నారు. ప్రభుత్వ పనుల్లో స్థానికులను భాగస్వాములను చేయాలన్నారు. గ్రామీణ ప్రజల దైనందిన అవసరాలను మేలైన పద్ధతిలో తీర్చాలన్నారు. ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, కేఆర్ నిహారిక, పద్మజ, వి.ప్రసాద్, ఎం.చక్రపాణిరావు, రీసోర్స్‌పర్సన్ శ్రీనివాసులు శిక్షణ ఇచ్చారు.

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి


సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల జట్లు

మంత్రి సుభాష్

రామచంద్రపురం: నేటితరం పిల్లలు చదువుతో పాటు క్రీడలకూ సమయం కేటాయించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-13 బాస్కెట్‌బాల్ సబ్ జూనియర్ బాలుర, బాలికల చాంపియన్ షిప్ పోటీలను మంత్రి సుభాష్ ప్రారంభించారు.

ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, చాంపియన్ షిప్ నిర్వాహకుడు చక్రవర్తి మాట్లాడుతూ.. రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గరిగిపాటి జానకిరామయ్య జ్ఞాపకార్థం ఈ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 14 బాలుర టీంలు, 8 బాలికల టీంలు ఈ పోటీల్లో తలపడతాయన్నారు. వీరిలో మంచి ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులను గుర్తించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి జట్టుకు, అక్కడి నుంచి త్వరలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటుందన్నారు. పోటీలను ప్రారంభించిన మంత్రి సుభాష్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో ఆటలు కూడా అంతే ముఖ్యమని అన్నారు. నేటి తరం పిల్లలకు సరైన శారీరక శ్రమ లేక చిన్న వయసులోనే బీపీ, సుగర్ వంటి రోగాల బారిన పడుతున్నారన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కౌన్సిలర్ తోట అమ్మాజీ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ పట్టణ ఇన్‌చార్జ్ కె.రాఘవన్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంతో ముగ్గురికి పునర్జన్మ

కాకినాడ క్రైం: ఆ యువకుడి అవయవ దానంతో ముగ్గురికి పునర్జన్మ లభించింది. పశ్చిమగోదావరి జిల్లా తోకలపూడి గ్రామానికి చెందిన పోలిశెట్టి రేవంత్ శ్రీ మురహరి (19) స్వగ్రామం నుంచి విశాఖపట్నానికి పరీక్ష రాసేందుకు ఈ నెల 21వ తేదీన బయలుదేరాడు. మార్గ మధ్యలో ఎర్రవరం హైవేపై రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కాకినాడ అపోలో ఆసుపత్రికి తరలించగా తగిన వైద్య సేవలు అందించినా తలకు తీవ్ర గాయం కావడంతో ఫలితం లేకపోయింది. బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో వైద్యులు డాక్టర్ ఎంవీ కిరణ్‌కుమార్, డాక్టర్ శివరామగాంధీ కుమారుడి పరిస్థితిని తండ్రి సుబ్రహ్మణ్యంకి వివరించి అవయవ దాన ప్రాధాన్యాన్ని వివరించారు. దీంతో సుబ్రహ్మణ్యం జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లో తన కుమారుడి అవయవ దానానికి రిజిస్టర్ చేశారు. దీంతో రేవంత్ కిడ్నీని కాకినాడ అపోలో ఆసుపత్రికి, మరో కిడ్నీని విశాఖపట్టణం కేర్ ఆసుపత్రికి, కాలేయాన్ని షీలానగర్ అపోలో ఆసుపత్రికి తరలించి ముగ్గురి ప్రాణాలు కాపాడారు. ఇందుకు కాకినాడ అపోలోలో ఆర్గాన్ హార్వెస్టింగ్ నిర్వహించారు. జిల్లా పోలీస్ శాఖ సాయంతో సోమవారం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి అవయవాలను సురక్షితంగా సకాలంలో తరలించారు.

రిజిస్ట్రేషన్ శాఖలో సబ్‌రిజిస్ట్రార్ల నియామకం

కాకినాడ లీగల్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఉమ్మడి జిల్లా పరిధిలోని సబ్ రిజిస్ట్రార్లు బదిలీల కౌన్సెలింగ్ ఆదివారం జరిగింది. ఏలూరు డీఐజీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని సబ్ రిజిస్ట్రార్లకు ఏలూరు, విజయవాడ, కాకినాడ డీఐజీల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ చేపట్టి బదిలీలు నిర్వహించారు.

కాకినాడ జిల్లా పరిధిలో..

కాకినాడ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1 : ఆర్‌వీ రామారావు
కాకినాడ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2: పీఎస్‌వీఎస్‌ఎస్ వీరభద్రరావు
జగ్గంపేట సబ్ రిజిస్ట్రార్: సీహెచ్ రమేష్‌బాబు
పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్: పి.విజయలక్ష్మి
ప్రత్తిపాడు సబ్‌రిజిస్ట్రార్: వీవీ డేనియల్
సామర్లకోట సబ్‌రిజిస్ట్రార్: బీవీవీ సత్యనారాయణ
పిఠాపురం సబ్‌రిజిస్ట్రార్: వి.రమాదేవి
తాళ్లరేవు సబ్‌రిజిస్ట్రార్: పి.శారద
తుని సబ్‌రిజిస్ట్రార్: టి.సుబ్బారెడ్డి
కాకినాడ డీఐజీ కార్యాలయ సబ్‌రిజిస్ట్రార్: ఆర్.శ్రీనివాసరావు
కాకినాడ మార్కెట్ అండ్ ఆడిట్ సబ్ రిజిస్ట్రార్: ఎ.శ్రీనివాస్
కాకినాడ చిట్ సబ్‌రిజిస్ట్రార్ : ఎ.సునందశ్రీ

తూర్పుగోదావరి జిల్లా పరిధిలో..

రాజమహేంద్రవరం జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1: ఆర్.రాంబాబు
రాజమహేంద్రవరం జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2: పుల్లంరాజు
బిక్కవోలు సబ్‌రిజిస్ట్రార్ : సీహెచ్ శ్రీనివాసబాబు
కడియం సబ్‌రిజిస్ట్రార్ : ఇ.లక్ష్మి
అనపర్తి సబ్‌రిజిస్ట్రార్ : కె.కమలప్రియ
పిడింగొయ్యి సబ్‌రిజిస్ట్రార్ : త్రినాథ్
రాజానగరం సబ్‌రిజిస్ట్రార్: వి.వెంకటేశ్వర్లు
కోరుకొండ సబ్‌రిజిస్ట్రార్ : వీవీఎన్‌బీ శ్రీనివాస్
సీతానగరం సబ్‌రిజిస్ట్రార్ : ఐహెచ్‌ఆర్‌కే ప్రసాద్
అనంతపల్లి సబ్‌రిజిస్ట్రార్: ఇ.వెంకటేశ్వరరావు
కొవ్వూరు సబ్‌రిజిస్ట్రార్ : కె.సుందరరావు
నిడదవోలు సబ్‌రిజిస్ట్రార్ : ఎం.రాజబాబు
వేగేశ్వరపురం సబ్‌రిజిస్ట్రార్ : మోహన్

కోనసీమ జిల్లా పరిధిలో..

అమలాపురం జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1: ఆర్.శ్రీలక్ష్మి
అమలాపురం జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2: లక్ష్మణ్‌రాజు
ముమ్మిడివరం సబ్‌రిజిస్ట్రార్: ఎం.సుధాకర్
రామచంద్రపురం సబ్‌రిజిస్ట్రార్: తోట శ్రీనివాస్
ఆలమూరు సబ్‌రిజిస్ట్రార్: కేవీఎస్ కుమారి
ద్రాక్షారామం సబ్‌రిజిస్ట్రార్: ఆర్.సత్యవతిరాణి
కొత్తపేట సబ్‌రిజిస్ట్రార్: ఎస్.శేఖర్‌బాబు
ఆత్రేయపురం సబ్‌రిజిస్ట్రార్: ఎం.రత్నకుమార్
రావులపాలెం సబ్‌రిజిస్ట్రార్: వి.సూర్యనారాయణ
అంబాజీపేట సబ్‌రిజిస్ట్రార్: యు.జగన్‌మోహన్‌రావు
రాజోలు సబ్‌రిజిస్ట్రార్: జి.రమ్యశ్రీ
మండపేట సబ్‌రిజిస్ట్రార్: షేక్ మౌలానా సాహెబ్
ఐ.పోలవరం సబ్‌రిజిస్ట్రార్: వి.భవాని నర్సమాంబ
అల్లవరం సబ్‌రిజిస్ట్రార్: సీహెచ్‌ఎస్‌ఎన్‌వీ సత్యనారాయణ
మలికిపురం సబ్‌రిజిస్ట్రార్: వి.వెంకటేశ్వరరావు
మామిడికుదురు సబ్‌రిజిస్ట్రార్: ఎంవీ మోహన్

గిన్నిస్‌కెక్కిన జెస్సీ విల్సన్, హదస్సా


గిన్నిస్ రికార్డులో భాగస్వామి తల్లి జెస్సీ విల్సన్ (చిత్రంలో కుడి చివర), కూతురు హదస్సా (ఎడమ నుంచి రెండో వ్యక్తి)

పెదపూడి: ఊలు దారాలతో గ్రానీస్క్వేర్స్ (మహిళలు ధరించే ఊలు వస్త్రాలు)ను విశాఖపట్టణానికి చెందిన మహిళా మనోవికాశ్ సంస్థ తయారు చేస్తుంది. ఈ నేపథ్యంలో ఆ సంస్థ వ్యవస్థాపకురాలు సూరిభట్ల మాధవి ఆధ్వర్యంలో 400 మంది గృహిణులు కలసి ఒక బృందంగా ఆరు నెలల్లో 58,112 గ్రానీ స్క్వేర్లను తయారు చేశారు. గత ఆదివారం విశాఖపట్నంలో నిర్వహించిన అతి పెద్ద గ్రానీ స్క్వేర్స్ ప్రదర్శనలో ఉంచగా వాటిని పరిశీలించిన గిన్నిస్ ప్రతినిధులు ‘లార్జెస్ట్ డిస్‌ప్లే క్రోచెట్ గ్రానీస్క్వేర్స్’గా ధ్రువీకరణ పత్రం అందించారు. ఈ బృందంలో పెదపూడి మండలం చింతపల్లి లాకుకు చెందిన జుత్తక జెస్సీ విల్సన్, ఆమె కుమార్తె హదస్సా సభ్యులు. దీంతో వారు కూడా గిన్నిస్ రికార్డులో భాగమయ్యారు. ఈ రికార్డు జెస్సీ విల్సన్‌కు రెండో సారి కాగా, ఆమె కుమార్తె హదస్సాకు మొదటిసారి. గిన్నిస్ రికార్డులో వీరిరువురు భాగస్వాములు కావడంతో వారికి పలువురు అభినందనలు తెలిపారు.

పలువురు ఈవోల బదిలీ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సాధారణ బదిలీల్లో భాగంగా దేవదాయ శాఖలో పని చేస్తున్న పలువురు ఈవోలను, డీసీ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది బదిలీ అయ్యారు. కాకినాడ బాలాత్రిపుర సుందరి ఆలయ ఈవో విజయభాస్కర్‌రెడ్డిని కాకినాడలోని బంగారు చిన్న శోభనాద్రి సత్రం ఈఓగా నియమించారు. ఆయన స్థానంలో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా చింతలూరు నూకాలమ్మ దేవస్థానం ఈవోగా పనిచేస్తున్న ఉండవల్లి వీర్రాజుచౌదరిని నియమించారు. పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ సంస్థానం ఈవోగా పనిచేస్తున్న సౌజన్యకు అదనంగా కాండ్రకోట నూకాలమ్మ దేవస్థానం ఈవోగా బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ పని చేస్తున్న సూర్యనారాయణను కరకుదురు ఈవోగా నియమించారు. వేలంగి గ్రూపు దేవస్థానాల ఈఓగా పనిచేస్తున్న ఎం.మురళీ వీరభద్రరావును కాకినాడ పెద్ద మార్కెట్ నూకాలమ్మ దేవస్థానం ఈవోగా నియమించారు. కాకినాడ జగన్నాథపురం పార్థసారథి దేవాలయం ఈవోగా పనిచేస్తున్న వడ్డాది సత్యనారాయణను బదిలీ చేశారు. ఆయన స్థానంలో ముమ్మిడివరంలో పనిచేస్తున్న పీకే లక్ష్మణరావును నియమించారు. కాకినాడ గాంధీనగర్ వేంకటేశ్వర స్వామి ఆలయ ఈవోగా చిత్తావజ్జల శ్రీనివాస నాగసుబ్రహ్మణ్యంను నియమించారు. కోటిపల్లి ఈవోగా పనిచేస్తున్న ఎం.శ్రీదేవిని కాకినాడ పైడా చలమయ్య కల్యాణమండపం ఈవోగా నియమించారు. కాకినాడ గ్రూపు దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న రమణను కడియం గ్రూపు దేవస్థానంకు బదిలీ చేశారు. కాకినాడ డిప్యూటీ కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్ కె.నాగేశ్వరరావును తూర్పుగోదావరి జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్‌గా నియమించారు. మరో సూపరింటెండెంట్ తోట సుబ్రహ్మణ్యంను రాజమహేంద్రవరం రీజినల్ జాయింట్ కమిషనర్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా నియమించారు. అక్కడ పనిచేస్తున్న సూపరింటెండెంట్ కృష్ణకుమారిని కాకినాడ డిప్యూటీ కమిషనర్ కార్యాలయనికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సోమరాజును కాకినాడ డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు .మురముళ్ల గ్రూపు దేవస్థానంల ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణను కాకినాడ సర్పవరం భావనారాయణ స్వామి ఆలయ ఈఓగా నియమించారు. కాకినాడ డీసీ కార్యాలయంలో పని చేస్తున్న అపర్ణను పెనుగుదురు గ్రూపు దేవస్థానాల ఈఓగా నియమించారు.

గొడౌన్‌లో బియ్యం చోరీ: ఛేదించిన పోలీసులు


కాకినాడ కొండేలుపేట వద్ద స్వాధీనం చేసుకున్న బియ్యం, లారీ, అరెస్టు చేసిన నిందితులతో సర్పవరం పోలీసులు

- రూ.4.5 లక్షల విలువైన సరకు స్వాధీనం
- లారీ సీజ్

కాకినాడ రూరల్: రైస్ బ్యాగ్‌ల దొంగతనాలకు పాల్పడే ముగ్గురు ముఠా సభ్యులను సోమవారం అరెస్టు చేసినట్టు సర్పవరం సీఐ బి.పెద్దిరాజు తెలియజేశారు. ఆయన వివరాలు ప్రకారం ఈనెల 13న రాత్రి దుమ్ములపేట రైల్వే గేటు సమీపాన ఒక రైస్ గొడౌన్ నుంచి సుమారు 500 బ్యాగ్‌ల బియ్యాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తరలించుకుపోవడంతో బాధితుడు సర్పవరం పోలీసుస్టేషన్‌లో మరుసటి రోజున ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో సర్పవరం సీఐ పెద్దిరాజు, సిబ్బంది, బృందాలుగా ఏర్పడి చోరీ కేసును ఛేదించేందుకు కృషి చేశారు. సోమవారం ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని కొండేలుపేట శివారులో అక్రమ బియ్యం నిల్వ ఉన్నట్టు తెలుసుకుని దాడి చేశారు. ఈ దాడిలో రూ.4.5 లక్షల విలువైన 500 బ్యాగ్‌లోని బియ్యం స్వాధీనం చేసుకుని అందుకు వినియోగించిన లారీని సీజ్ చేశారు. రైస్ దొంగతనానికి పాల్పడిన కాకినాడ డెయిరీ ఫామ్ సెంటర్‌కు చెందిన పట్నాల వంశీరెడ్డి, షేక్ అహ్మద్ అలీ, జగన్నాథపురం గోలీలపేటకు చెందిన అనసూరి దుర్గలను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రైస్ బ్యాగ్‌ల చోరీ కేసును ఛేదించామని నిందితుల్లో పట్నాల వంశీరెడ్డిపై పోర్టు పీఎస్‌లో 12 కేసులు, షేక్ అహ్మద్ అలీపై ఆరు కేసులు, అనసూరి దుర్గాపై వన్ టౌన్ పీఎస్‌లో ఆరు కేసులు ఉన్నాయన్నారు. ముగ్గురు నిందితులపై సస్పెక్ట్ రౌడీ షీట్ ఉందన్నారు. కేసు ఛేదించేందుకు ఎస్సై రామకృష్ణమూర్తి, హెచ్‌సీలు సత్తిబాబు, రాజు, గణేష్, పీసీ వెంకటరత్నంలను ఎస్పీ అభినందించారని సీఐ తెలిపారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

చాగల్లు: మండలంలో చిక్కాలలో మనస్థాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై కె.నరేంద్ర తెలిపారు. గ్రామానికి చెందిన సంసాని గంగరాజు (43)కు అదే గ్రామానికి చెందిన పెదపాటి పండుకి గ్రామంలో ప్రాథమిక పాఠశాల వద్ద రోడ్డుపై ఘర్షణ చోటు చేసుకుంది. ఈ సమయంలో గంగరాజును పండు చంపుతానని బెదిరించాడు. అనంతరం ఈ ఘటనతో తీవ్ర మనస్థాపానికి గురైన గంగరాజు తన ఇంటికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గంగరాజు భార్య కోట సత్యవతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతదేహానికి నిడదవోలు ప్రభుత్వ ఆస్పత్రిలో పంచనామా నిర్వహించారు. గంగరాజు మృతి నేపథ్యంలో గ్రామంలో ఎటువంటి ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకోకుండా కొవ్వూరు రూరల్ సీఐ కె.విజయబాబు ఆధ్వర్యంలో పోలీసులు గ్రామంలో బందోబస్తు నిర్వహించారు. పరిస్థితిని జిల్లా ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు చిక్కాల వచ్చి పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి


మృతి చెందిన ఆదిలక్ష్మి, సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్సై కృష్ణామాచారి

తుని రూరల్: తుని మండలం తేటగుంట శివారు ఎర్రకోనేరు జంక్షన్‌లో సోమవారం 16వ నంబర్ జాతీయ రహదారిపై లారీ బైక్‌ను ఢీకొంది. ప్రమాద విషయం తెలియడంతో రూరల్ సీసీ చెన్నకేశవరావు, రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రూరల్ ఎస్సై తెలిపిన వివరాలిలా.. గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన పిల్లి పెదకాపు తన భార్య ఆదిలక్ష్మితో కలసి బైక్‌పై తునిలో బంధువులను పరామర్శించడానికి వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి బయలుదేరిన వారు ఎర్రకోనేరు జంక్షన్‌కు చేరుకున్నారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా దూసుకువచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో కిందపడిన ఆదిలక్ష్మి(55) తలకు బలమైన గాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త పెదకాపు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో తుని ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. క్షతగాత్రుడి సోదరుడు పిల్లి వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పిడుగుపడి రైతు మృతి

రంగంపేట: మండలంలోని వడిశలేరులో మంగళవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షం కారణంగా పిడుగుపాటుకు గురై రైతు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వైట్ల నరేంద్ర రాంబాబు (45) ఏడీబీ రోడ్డు పక్కన ఉన్న తన పొలానికి వెళ్లాడని పొలంలో ఉండగానే భారీ వర్షం కురవడంతో అక్కడే చెట్టు కింద ఉన్న ఇనుప బల్లపై కూర్చుండగా ఒక్కసారిగా పిడుగు పడటంతో నరేంద్ర రాంబాబు షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. ఈ ప్రమాదంలో మృతుడి వీపు భాగం కాలిపోయిందన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.